కేంద్ర మంత్రి భూపేందర్‌కు ఎంపీ వద్దిరాజు పరామర్శ

కేంద్ర మంత్రి భూపేందర్ యాదవ్‌ను పరామర్శిస్తున్న ఎంపీ వద్దిరాజు

ఖమ్మం, మార్చి 18: ఇటీవల తన తండ్రిని కోల్పోయిన కేంద్ర అటవీ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్‌ను, ఆయన కుటుంబ సభ్యులను రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, ఆర్. కృష్ణయ్య, బీదా మస్తాన్‌రావు మంగళవారం పరామర్శించారు. భూపేందర్ యాదవ్ తండ్రి బాబూ కదమ్ సింగ్ యాదవ్ (92) ఈ నెల 15న మృతిచెందారు. ఈ నేపథ్యంలో ఎంపీలు రవిచంద్ర, కృష్ణయ్య, మస్తాన్‌రావులు హర్యానాలోని జమాల్‌పూర్‌కు వెళ్లి బాబూ కదమ్ సింగ్ చిత్రపటంపై పూలు చల్లి నివాళులర్పించారు.

సత్తుపల్లి సింగరేణి బొగ్గు గనులకు 50 ఏళ్ల పాటు అనుమతుల పొడిగింపు

సత్తుపల్లి టౌన్, మార్చి 18: సత్తుపల్లి ప్రాంతంలో విస్తరించి ఉన్న సింగరేణి ఉపరితల బొగ్గు గనుల నుంచి మరో 50 ఏళ్లపాటు బొగ్గును వెలికితీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతులిచ్చింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా మంగళవారం జీవోను జారీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ అనుమతుల మేరకు సత్తుపల్లి ప్రాంతంలోని ఉపరితల గనుల్లో 2005 నుంచి సింగరేణి సంస్థ బొగ్గును వెలికి తీస్తోంది. తాజాగా ఈ బొగ్గు వెలికితీత అనుమతులను రాష్ట్ర ప్రభుత్వం మరో 50 ఏళ్లకు పెంచడంతో సత్తుపల్లి సమీపంలోని కిష్టారం, జగన్నాథపురం, రేజర్ల, అయ్యగారిపేట తదితర ప్రాంతాల నుంచి సింగరేణి సంస్థ బొగ్గును వెలికితీయనుంది.

'పబి'లో ప్రతిభ చాటండి : కలెక్టర్

ప్రోత్సాహక బహుమతుల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

ఖమ్మం అర్బన్, మార్చి18 : పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ చాటి మిత్ర ఫౌండేషన్ అందజేసే ప్రోత్సాహక బహుమతులు గెలుచుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో సంబంధిత పోస్టర్‌ను ఆవిష్కరించారు. మొదటిస్థానం పొందిన వారికి రూ.25 వేలు, ల్యాప్‌టాప్, ద్వితీయస్థానం వారికి రూ.25 వేలు, తృతీయస్థానం వారికి రూ.15 వేలు, మరో ఐదుగురికి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున బహుమతులు అందజేయనున్నారు. వీటితోపాటు ఐదుగురు ప్రతిభావంతులకు విమాన ప్రయాణంతో 3రోజుల ఢిల్లీయాత్ర అవకాశం కల్పించనున్నారు. తుమ్మల యుగంధర్ ప్రోత్సాహంతో ఈ ఐదుగురు విద్యార్థులకు కార్పొరేట్ కళాశాలలో అడ్మిషన్ సదుపాయం కల్పించనున్నట్లు మిత్ర గ్రూప్ చైర్మన్ కురువెళ్ళ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్స్ రంగా శ్రీనివాస్, చెరుకూరి యుగేంధర్, పాలవరపు శ్రీనివాస్, చారుగుండ్ల రవికుమార్, నాగ సాయి గ్యాస్ నగేష్, మేళ్ళచెరువు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బీటెక్ ఫలితాల్లో 'బొమ్మ' విద్యార్థుల ప్రతిభ

ప్రతిభ చాటిన విద్యార్థులతో బొమ్మ కళాశాల యాజమాన్య బాధ్యులు

ఖమ్మం అర్బన్, మార్చి 18: జేఎన్‌టీయూహెచ్ ప్రకటించిన బీటెక్ ఫస్టియర్ ఫలితాల్లో తమ విద్యార్థులు సత్తా చాటినట్లు ఖమ్మం బొమ్మ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ బొమ్మ రాజేశ్వరరావు మంగళవారం తెలిపారు. ఏఐఎంఎల్‌లో దివ్యశ్రీ 83.3 శాతం, అభినేశ్ 75, సీఎస్ఈలో ఫహిమా ఫిర్దోస్ 83.2, తరణి 79, ఈసీలో సాయిచరణ్ 79.6, మహేశ్ 75.6 శాతం ఉత్తీర్ణతతో రాణించినట్లు వివరించారు. ప్రతిభ చాటిన విద్యార్థులను కళాశాల వైస్ చైర్మన్ బొమ్మ సత్యప్రసాద్, సెక్రటరీ ఊదారు శ్రీధర్ అభినందించారు.

శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ

విద్యార్థులతో కళాశాల నిర్వాహకులు

ఖమ్మం రూరల్, మార్చి 18: జేఎన్‌టీయూ విడుదల చేసిన బీటెక్ మొదటి సంవత్సరం ఫస్ట్ సెమిస్టర్ ఫలితాల్లో మండలంలోని శ్రీచైతన్య ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని కళాశాల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్ తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ అండ్ మిషన్ లెర్నింగ్‌లో మహ్మద్ ఇర్ఫాన్ షరీఫ్, ఎలక్ట్రానిక్స్ కమ్యునికేషన్ విభాగంలో 9.75 జీపీఏ సాధించి యూనివర్సిటీ స్థాయిలో మొదటి స్థానంలో నిలిచారన్నారు. అదే విధంగా 9.5 నుంచి 9.0 జీపీఏ మరో 63మంది విద్యార్థులు సాధించారని పేర్కొన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు, అధ్యాపకులను కళాశాల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరక్టర్లు మల్లెంపాటి శ్రీవిద్య, సాయి గీతిక, ప్రిన్సిపల్ మురళీకృష్ణ, డీన్ సుదర్శన్, డాక్టర్ రాజేష్, వైశాలి, కృష్ణ ప్రసాద్ అభినందించారు.

గౌతమి విద్యా సంస్థల అధినేత దాతృత్వం

పిండిప్రోలులో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్

తిరుమలాయపాలెం, మార్చి 18: మండలంలోని పిండిప్రోలు గ్రామానికి చెందిన గౌతమి విద్యా సంస్థల అధినేత కాంపాటి బాబురావు, ప్రమీల దంపతులు స్వగ్రామానికి సహాయ సహకారాలు అందజేశారు. తమ గౌటమి ట్రస్ట్ ద్వారా ఇటీవల తమ సొంత ఖర్చుతో రూ.3 లక్షలతో మినిరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. ప్రజలకు రూ.5 లకే క్యాన్ చొప్పున మంచినీరు సరఫరా చేస్తున్నారు. గ్రామంలో మృతి చెందిన వారి మృతదేహాలను అంత్యక్రియలకోసం వైకుంఠధామానికి తరలించేందుకు వైకుంఠ రథాన్ని రూ.8 లక్షల వ్యయంతో తయారు చేయించారు. వైకుంఠ రథాన్ని పంచాయతీ అధికారుల సమక్షంలో బుధవారం గ్రామపంచాయతీకి అప్పగిస్తారు.

పాత కాలువ వారబందీ తీసి వేయాలి

కూసుమంచి, మార్చి 18: పాలేరు రిజర్వాయర్ పరిధిలో గల పాత కాలువ కింద కూసుమంచి, నేలకొండపల్లి మండలాల రైతులకు సాగునీటి వసతి గల పాలేరు చానల్ పాత కాలువ సాగర్ ఆయకట్టు ఎడమ కాలువ మొదటి జోన్ కింద ఉంటే దానికి వారబందీ ఎలా పెడతారని సీపీఎం అనుబంధ రైతు సంఘం బాధ్యులు మల్లెల షన్మతరావు, బిక్కసాని గంగాధర్ ప్రశ్నించారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు.

తాగు నీటి సమస్యలు తలెత్తొద్దు

కూసుమంచి, మార్చి 18: మండలంలోని ప్రతీ గ్రామాన్ని యూనిట్‌గా తీసుకొని ఎక్కడా వేసవిలో తాగునీటి సమస్య రాకుండా చూడాలని, ఒకవేళ ఇబ్బంది కలుగుతుందని భావిస్తే ప్రత్యామ్నాయ అవకాశాలను రెడీగా పెట్టుకోవాలని పాలేరు నియోజకవర్గ స్పెషలాఫీసర్ రమేశ్ అన్నారు. మంగళవారం కూసుమంచిలో ఎంపీడీవో వేణుగోపాల్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు

- *రెండు రాష్ట్రాల్లో 90కి పైగా కేసులు నమోదు*
- *సత్తుపల్లి కానిస్టేబుల్‌పై హత్యా యత్నం చేసింది కూడా ఇతనే..*
- *వివరాలు వెల్లడించిన ఖమ్మం సీపీ సునీల్‌దత్*

విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్

సత్తుపల్లి టౌన్, మార్చి 18 : తెలుగు రాష్ట్రాల్లో పలు దొంగతనాలకు పాల్పడడంతోపాటు ఈ నెల 10న సత్తుపల్లిలో కానిస్టేబుల్‌పై హత్యా యత్నం చేసిన అంతర్రాష్ట్ర దొంగను సత్తుపల్లి పోలీసులు పట్టుకున్నట్లు ఖమ్మం సీపీ సునీల్‌దత్ తెలిపారు. సత్తుపల్లి పోలీస్‌స్టేషన్‌లో కల్లూరు ఏసీపీ రఘుతో కలిసి మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీ వివరాలు వెల్లడించారు. సత్తుపల్లి మండలం కొత్తూరు శివారు శ్మశాన వాటిక వద్ద ఓ వ్యక్తి అనుమానాస్పదంగా తిరుగుతున్నాడని సీఐ కిరణ్‌కు అందిన సమాచారం మేరకు ఎస్సై కవిత, కానిస్టేబుల్ నరేశ్, శ్రీనివాస్‌లను అక్కడికి పంపించారు. ఈ నెల 10న కానిస్టేబుల్ నరేశ్‌పై హత్యా యత్నం చేసి పారిపోయిన వ్యక్తి ఇతనే కావడంతో పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి విచారించగా.. పలు నేరాలకు పాల్పడినట్లు తేలింది. ఆంధ్రా రాష్ట్రం ఏలూరు జిల్లా చాట్రాయి మండలం చిత్తపూర్ గ్రామానికి చెందిన తిరువీధుల సురేంద్ర రెండు రాష్ట్రాల్లో సుమారు 90కి పైగా దొంగతనాలకు పాల్పడినట్లు తెలిపారు. అతడు దొంగిలించిన సొత్తుతోపాటు ఏ ప్రాంతంలో దొంగతనాలకు పాల్పడుతాడో అక్కడి శ్మశాన వాటికలకు వెళ్లి తలదాచుకుంటాడు. అయితే సురేందర్‌పై ఖమ్మం కమిషనరేట్ పరిధిలో 15 కేసులు, కొత్తగూడెంలో 4 కేసులు, మహబూబాబాద్‌లో 3 కేసులు, వరంగల్ కమిషనరేట్ పరిధిలో 3 కేసులతో పాటు గడిచిన మూడు నెలల్లో సూర్యాపేట 7, నల్లగొండ 5, ఏలూరు 5, పశ్చిమగోదావరి జిల్లాలో ఒక కేసు.. మొత్తం 43 కేసులు నమోదైనట్లు పేర్కొన్నారు. అతడి నుంచి 461.8 గ్రాముల బంగారం, 429 గ్రాముల వెండి, రూ.3.37 లక్షల నగదు, రెండు బైక్‌లు, ఒక సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి మంగళవారం కోర్టులో హాజరుపరిచారు. దొంగ నుంచి పెద్దమొత్తంలో ఆస్తిని రికవరీ చేసినందుకు సీఐ కిరణ్, ఎస్సై కవిత, కానిస్టేబుళ్లు శ్రీనివాస్, నరేశ్‌కుమార్‌లను సీపీ అభినందించారు.

హార్వెస్ట్‌లో కిండర్ గార్డెన్ గ్రాడ్యుయేషన్ డే

ఖమ్మం అర్బన్, మార్చి 18 : ఖమ్మం నగరంలోని హార్వెస్ట్ పాఠశాలలో మంగళవారం కిండర్‌గార్డెన్ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే వేడుకలను నిర్వహించారు. డాక్టర్ సురేష్ మాట్లాడుతూ భవిష్యత్‌లో ఎన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించినా తొలి అడుగు ఎప్పటికీ మధురంగానే ఉంటుందన్నారు. గ్రాడ్యుయేషన్ డ్రెస్‌లో చిన్నారులు అలరించగా, వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కరస్పాండెంట్ పోపూరి రవిమారుత్, ప్రిన్సిపాల్ రామసహాయం పార్వతిరెడ్డి, కె మానస పాల్గొన్నారు.

ఇంటర్‌లో ఇద్దరు డిబార్

ఖమ్మం అర్బన్, మార్చి 18 : ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా మంగళవారం జరిగిన ద్వితీయ సం వత్సరం పరీక్షలో ఇద్దరు విద్యార్థులు డిబార్ అ య్యారు. ఖమ్మంలోని ఏఎస్ఆర్ కళాశాల కేంద్రం లో ఒకరు, కృష్ణవేణి కో ఆపరేటివ్ కళాశాల కేంద్రం లో మరో విద్యార్థిని డిబార్ అయినట్లు డీఐఈవో కె.రవిబాబు తెలిపారు. బుధవారంతో ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు ముగియనున్నాయి.

మద్యం దుకాణాల తనిఖీ

వైరాటౌన్, మార్చి 18: మండలంలోని గన్నవరం గ్రామంలో బెల్ట్‌షాపులను ఎక్సైజ్ సీఐ మమతారెడ్డి ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. బెల్ట్ షాపులో అక్రమంగా నిల్వ ఉంచిన రూ.30వేలు విలువైన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. బెల్ట్‌షాప్ నిర్వహిస్తున్న దారా మల్లికార్జునరావును అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. ఎక్సైజ్ సీఐ మమతారెడ్డి, ఎస్సై రత్నప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

31కల్లా బిల్లులు వసూలు చేయాలి

వైరాటౌన్, మార్చి 18: వైరా మున్సిపాలిటీ పరిధిలో ఇంటి పన్ను బకాయిలను ఈ నెల 31 వరకు వందశాతం వసూలు చేయాలని రీజనల్ డైరెక్టర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ వరంగల్ షాహిద్ మసూద్ అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయాన్ని ఆయన సందర్శించి సిబ్బందితో సమావేశాన్ని ఏర్పాటు చేశారు.

ఆశాల వేతనాల పెంపుపై అసెంబ్లీలో తీర్మానం చేయాలి

కారేపల్లి, మార్చి 18: గ్రామాల్లో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్యసేవలు అందజేస్తున్న ఆశ కార్యకర్తలకు వేతనాలు పెంచుతూ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో తీర్మానం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు కుందనపల్లి నరేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక ఆశా వర్కర్లతో కలిసి తహసీల్దార్ సంపత్ కుమార్‌కు మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు.

ఆశాల సమస్యలు పరిష్కరించాలి

ఎర్రుపాలెం, మార్చి 18: ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలని బనిగండ్లపాడు ఆస్పత్రి వద్ద ఆశా వర్కర్లు మంగళవారం ధర్నా చేపట్టి వినతిపత్రాన్ని డాక్టర్‌కు అందించారు. అనంతరం సుధా అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీఐటీయూ నాయకులు సగ్గుర్తి సంజీవరావు, యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దాల ప్రభాకర్‌రావు మాట్లాడారు. ఆశ కార్యకర్తల డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ బుధవారం ఖమ్మం కలెక్టరేట్ ఎదుట చేపట్టే ధర్నాకు ఆశాకార్యకర్తలందరూ రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

మధ్య గేటు వద్ద ఆర్‌యూబీ నిర్మించాలి

త్రీటౌన్ పరిరక్షణ కమిటీ బాధ్యులు, అఖిలపక్షం నేతల డిమాండ్

ఖమ్మం నగరంలో నిరసన ప్రదర్శన.. రైల్వే మేనేజర్‌కు వినతి..

మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేత ఆర్‌జేసీ కృష్ణ

ఖమ్మం, మార్చి 18: ఖమ్మం నడిబొడ్డులోని కమాన్‌బజార్ – గాంధీచౌక్ మధ్యలో ఉన్న రైల్వే మధ్య గేట్ ప్రాంతంలో రైల్వే అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ)ని నిర్మించాలని ఖమ్మం త్రీటౌన్ పరిరక్షణ కమిటీ బాధ్యులు, అఖిలపక్షం నేతలు డిమాండ్ చేశారు. తొలుత బడ్జెట్ హోటల్ నుంచి రైల్వే గేట్ వరకూ మంగళవారం ప్రదర్శన నిర్వహించారు. అక్కడే రైల్వే మూడో లైన్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న చీఫ్ ఇంజినీర్ రామారావుకు సమస్యను వివరించి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా త్రీటౌన్ పరిరక్షణ కమిటీ కన్వీనర్ ఆర్జేసీ కృష్ణ, అధ్యక్షుడు సన్నే ఉదయ్ ప్రతాప్ మాట్లాడారు. కమాన్‌బజార్, కస్బాబజార్ నుంచి త్రీటౌన్‌కు అనుసంధానంగా ఉన్న రైల్వే మధ్య గేటు ద్వారా రోజుకు వేలాదిమంది ప్రయాణిస్తుంటారని అన్నారు. అలాంటి ప్రాంతంలో బ్రిడ్జిని నిర్మించాల్సి ఉన్నా.. ఇప్పటికే ఉన్న రైల్వే గేటును కూడా మూసివేస్తారన్న ఆరోపణలు వస్తున్నాయని అన్నారు. అనంతరం సన్నే ఉదయ్ ప్రతాప్ మాట్లాడుతూ.. మధ్య గేటుకు ఇరువైపులా ఎన్నో ఏళ్లుగా వ్యాపారంపై ఆధారపడి జీవిస్తున్న వేలాదిమంది కోసం ఇక్కడ ఆర్‌యూబీ నిర్మించాలని కోరారు. వివిధ పార్టీల నేతలు, త్రీటౌన్ పరిరక్షణ కమిటీ సభ్యులు, వర్తక సంఘం బాధ్యులు ఎర్రా శ్రీకాంత్, నూనె శశిధర్, చిన్ని కృష్ణారావు, బీఆర్ఎస్ కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు పేరును యథాతథంగా ఉంచాలి

లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తాం.. ఖమ్మంలో ఆర్యవైశ్య సంఘాల హెచ్చరిక

ఖమ్మం, మార్చి 18 : తెలుగు విశ్వవిద్యాలయానికి ఉన్న పొట్టి శ్రీరాములు పేరును కాంగ్రెస్ ప్రభుత్వం మార్చడం పట్ల ఖమ్మంజిల్లా ఆర్యవైశ్య సంఘం, ఖమ్మం నగర ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆర్యవైశ్యులంతా కలిసి ఖమ్మంలోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. తెలుగు యూనివర్సిటీకి పొట్టి శ్రీరాములు పేరును యథాతథంగా ఉంచాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే తన నిర్ణయాన్ని వెనక్కు తీసుకోకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమించి ఆర్యవైశ్యుల సత్తా చూపిస్తామని ముక్తకంఠంతో నినదించారు. కార్యక్రమంలో ఖమ్మంజిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పసుమర్తి సీతాచందర్‌రావు, ఖమ్మం నగర ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గుమ్మడవెల్లి శ్రీనివాస్, గోళ్ళ రాధాకృష్ణమూర్తి, మేళ్లచెరువు వెంకటేశ్వరరావు, కొత్త వెంకటేశ్వరరావు, చిన్ని కృష్ణారావు, నరేష్‌కుమార్, ఉదయ్‌ప్రతాప్, వేములపల్లి వెంకటేశ్వరరావు, వనమా వేణుగోపాలరావు, మాశెట్టి వరప్రసాద్, రాయపూడి రవికుమార్, జయరామ్, రామారావు, దివాకర్ గుప్తా, శ్రీనివాస్, పుల్లారావు, రవి, విశ్వేశ్వరరావు, పాల్వాయి వెంకటేశ్వరరావు, ధనుంజయరావు, కందిబండ వేణుగోపాల్ పాల్గొన్నారు. ఆర్యవైశ్యులకు పలు రాజకీయ పార్టీల నాయకులు మద్దతు తెలిపారు.

పలువురిని పరామర్శించిన జడ్పీ మాజీ చైర్మన్

చిట్టెమ్మ భౌతికకాయం వద్ద నివాళి అర్పిస్తున్న లింగాల

మధిర, మార్చి18: మధిర మున్సిపాలిటీ పరిధిలో పలువురిని జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు మంగళవారం పరామర్శించారు. సీపీఎం నాయకులు, మాజీకౌన్సిలర్ కట్టా గాంధీని, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, మాజీ కోఆప్షన్‌సభ్యుడు కపిలవాయి జగన్మోహన్‌రావు, 21వ వార్డులో యార్లగడ్డ రమేశ్ అనారోగ్యంతో బాధపడుతుండటంతో వారిని పరామర్శించారు. 20వ వార్డులో మంగళవారం మృతిచెందిన మేడ చిట్టెమ్మ భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళి అర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పెనుబల్లిలో..

పెనుబల్లి, మార్చి18: కల్లూరు మండలం చెన్నూరు గ్రామానికి చెందిన అరిగెల కృష్ణ, కోట లక్ష్మి, దళితివాడకు చెందిన కర్రి జయరావు సతీమణి లక్ష్మి ఇటీవల మృతిచెందారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు, చెన్నూరు సొసైటీ అధ్యక్షుడు పాలెపు రామారావు మంగళవారం కుటుంబాలను పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

నాణ్యమైన విద్యుత్ కోసం 33/11 కేవీ లైన్: ఎస్ఈ

రఘునాథపాలెం, మార్చి 11: వేసవిలో వినియోగదారులకు నిరంతరం నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు ఖమ్మం ఇండస్ట్రియల్ ఏరియా సబ్‌స్టేషన్ పరిధిలోని బల్లేపల్లి సెక్షన్‌లో 33/11 కేవీ లైన్‌ను రూ.25 లక్షలతో ఏర్పాటుచేసినట్లు విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాసాచారి తెలిపారు. ఈ నూతన లైన్‌ను మంగళవారం ఆయ న ప్రారంభించి మాట్లాడారు. ఈ లైన్ వల్ల పాండురంగాపురం, బల్లేపల్లి, బాలప్పేట, జయనగర్ కాలనీ ప్రాంతాలకు అంతరాయం లేని విద్యుత్‌ను సరఫరా చేస్తామని అన్నారు. ఇంజినీర్లు రామారావు, సంజీవ్‌కుమార్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వరి బోనస్ విడుదల చేయాలి

ఖమ్మం రూరల్, మార్చి 18: వరి పంటను ప్రభుత్వం కొనుగోలు చేసి క్వింటాకు రూ.500బోనస్ ఇస్తామని చెప్పి నేటి వరకు ఇవ్వలేదని, తక్షణం రైతులకు చెల్లించాలని సీపీఎం నాయకులు ఊరడి సుదర్శన్‌రెడ్డి, నంద్రాప్రసాద్ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని కాచిరాజుగూడెం, కస్నాతండా, వాల్యాతండా, రేగులతండాకు చెందిన రైతులతో కలసి వారు కాచిరాజుగూడెం రైతువేదిక వద్ద నిరసన చేపట్టారు. సమస్యలు పరిష్కరించనట్లయితే మంత్రుల ఇండ్లు, ప్రభుత్వ కార్యాలయాలను తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ముట్టడిస్తామని హెచ్చరించారు.

రావుల చంద్రశేఖర్‌రెడ్డిని కలిసిన బీఆర్ఎస్ నాయకులు

రావుల చంద్రశేఖర్‌రెడ్డితో మధిర బీఆర్ఎస్ నాయకులు

మధిర, మార్చి18: తెలంగాణ భవన్ ఇన్‌చార్జి రావుల చంద్రశేఖర్‌రెడ్డిని హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ మధిర రూరల్ కమిటీ అధ్యక్షుడు పల్లపోతు వెంకటేశ్వరరావు, రావూరి శ్రీనివాసరావు మంగళవారం కలిశారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులు దానికి అనుగుణంగా వ్యవహరించవల్సిన విషయాలపై వారికి సూచన చేశారు.

ఎస్‌బీఐ మేనేజర్‌కు రాష్ట్ర స్థాయిలో అవార్డు

అవార్డు అందుకొంటున్న సురేందర్

కూసుమంచి, మార్చి 18: కూసుమంచి ఎస్‌బీఐలో ఉత్తమ సర్వీసులు అందించిన మేనేజర్ వడ్డ్యా సురేందర్‌కు రాష్ట్రస్థాయి అవార్డు దక్కింది. హైద్రాబాద్‌లో ఎస్‌బీఐ సీజీఎం రాజేశ్‌కుమార్ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు. మండలంలోని లోక్యాతండాకు చెందిన సురేందర్ రెండున్నర సంత్సరాల కిందట కూసుమంచిలో ఎస్‌బీఐ మేనేజర్‌గా బదిలీపై వచ్చారు. ఉత్తమ బ్యాకింగ్‌తో పాటు, ఎక్స్‌లెంట్ పెర్ఫామెన్స్ కింద మేనేజర్‌గా గుర్తింపు రావటం పట్ల సిబ్బంది, వినియోగదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

టీజీపీఎస్సీ ఫలితాల్లో మూడో ర్యాంక్

కూసుమంచి, మార్చి 18: తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన టీజీపీఎస్సీ ఫలితాల్లో కూసుమంచి మండలం కిష్టాపురం గ్రామానికి చెందిన కంచరకుంట నరేందర్‌రెడ్డికి మూడో ర్యాంక్ వచ్చింది. గ్రేడ్–1 హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్‌గా ఉద్యోగం సంపాదించాడు. నరేందర్ రెడ్డికి పలువురు అభినందనలు తెలిపారు. సురేందర్‌రెడ్డి వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చాడు.

ఎస్సార్ఎస్పీ ద్వారా చెరువులకు నీరు ఇవ్వాలి

ముదిగొండ, మార్చి 18: ఎస్సార్ఎస్పీ కాలవల ద్వారా చెరువులు, కుంటలు నింపి పంటలు రక్షించుకోవాలని ఖమ్మం ఆర్డీవో గరిడె నర్సింహారావు అన్నారు. మంగళారం మండలంలోని మాధాపురం గ్రామంలో ఆయన పంటలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కూసుమంచి మండల రైతులు ఎస్సార్ఎస్పీ కాలువలకు అడ్డుకట్టలు వేస్తున్నారని, దీనిని నిరోధించాలన్నారు. పూర్తి స్థాయి కాల్వ తీయక పోవడంతో కింది ఆయకట్టు రైతులకు నీరు అందడం లేదన్నారు. పంటల రక్షణకు అన్ని మార్గాల ద్వారా నీరు అందించాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సునీత ఎల్జెబిత్, ఏవో వేణు, ఆర్ఐ వహీద తదితరులు పాల్గొన్నారు.

వంద శాతం పన్నులు వసూలు చేయాలి

ఖమ్మం, మార్చి 18: ఖమ్మంలో వాణిజ్య బకాయిలపై రెవెన్యూ అధికారులు అధిక దృష్టి సారించాలని, వంద శాతం వసూళ్లు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ సూచించారు. ఆస్తి పన్నుల వసూళ్లపై నగరంలోని కేఎంసీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన అధికారుల సమీక్షలో ఆయన మాట్లాడారు. ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న దృష్ట్యా పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని సూచించారు. బకాయిలు ఉన్న ఆస్తులను సీజ్ చేయడానికి కూడా వెనుకాడొద్దని స్పష్టం చేశారు. ఈ నెల 31 వరకు రెవెన్యూ సిబ్బందికి సెలవులు ఇవ్వలేమని స్పష్టం చేశారు.

'రైతుబంధు' రుణం చెక్కుల పంపిణీ

రఘునాథపాలెం, మార్చి 18: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో రైతుబంధు పథకం కింద మంజూరైన రుణాల చెక్కుల పంపిణీ కార్యక్రమం మంగళవారం జరిగింది. ఏఎంసీ చైర్మన్ యరగర్ల హనుమంతరావు.. ఐదుగురు రైతులకు ఒక్కొక్కరికి రూ.2 లక్షల చెక్కులను తన కార్యాలయంలో అందజేశారు. మార్కెట్‌కు పంట ఉత్పత్తులను తీసుకొచ్చే రైతులు తక్కువ ధరకు అమ్ముకోకుండా పంటను మార్కెట్ కమిటీ శీతల గిడ్డంగుల్లో నిలువ ఉంచుకొని రైతుబంధు పథకం కింద రుణాన్ని పొందవచ్చునని చైర్మన్ సూచించారు. పంటపై 75 శాతం వరకు 6 నెలల పాటు వడ్డీలేని రుణాన్ని పొందవచ్చన్నారు. పాలకవర్గ సభ్యులు బోజెడ్ల సత్యనారాయణ, వెలిగండ్ల బాబురావు, లతీఫ్, రమేశ్, మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

సబ్ యార్డును పరిశీలించిన ఏఎంసీ చైర్మన్

ఎర్రుపాలెం, మార్చి 18: ఎర్రుపాలెం ఏఎంసీ సబ్‌యార్డును మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ కే.చంద్రశేఖర్ మంగళవారం పరిశీలించారు. యార్డులో